సాక్షి వనపర్తి


శుక్రవారం । 5 । సెప్టెంబర్ । 2025



బ్యాడ్మింటన్ పోటీలు

పాలమూరు మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో 11వ రాష్ట్రస్థాయి జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నీ గురువారం ప్రారంభమైంది.

-8లో ▸



కొనసాగుతున్న వరద

జూరాల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద గురువారం నిలకడగా కొనసాగినట్లు అధికారులు తెలిపారు.

-8లో ▸

గరిష్టం/కనిష్టం

33.4/21.9

వాతావరణం

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'రెవెన్యూ' దరఖాస్తులు పరిష్కరించాలి



ఆత్మకూర్: రెవెన్యూ సదస్సుల దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, అధికారులు అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని ఆర్డీఓ సుబ్రమణ్యం సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రెవెన్యూ దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొత్తం 243 దరఖాస్తులు వచ్చాయని.. 36 పరిష్కరించామని, మిగిలిన వాటిని త్వరలో పరిష్కరిస్తామని తహసీల్దార్ చాంద్‌పాషా వివరించారు. అలాగే రైస్‌మిల్లర్లు సీఎంఆర్ సకాలంలో ఎఫ్‌సీఐకి అందించేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ ఆదేశించారు.

నేడు రేషన్ దుకాణాల బంద్

వనపర్తి రూరల్: రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలంటూ శుక్రవారం బంద్‌కు పిలుపునిచ్చామని.. విజయవంతం చేయడానికి ప్రజలు సహకరించాలని జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు బచ్చు రాము గురువారం ఒక ప్రకటనలో కోరారు. కాంగ్రెస్‌పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని, 5 నెలల పెండింగ్ కమీషన్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డీలర్లకు గౌరవ వేతనం రూ.5 వేలు, క్వింటాకు రూ.300 కమీషన్ ఇవ్వాలని పేర్కొన్నారు.

నిండుకుండలా రామన్‌పాడు జలాశయం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో గురువారం సముద్రమట్టానికి పైన 1,021 అడుగుల పూర్తిస్థాయి నీటిమట్టం ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ కాల్వ నుంచి 920 క్యూసెక్కుల వరద చేరుతుండగా.. సమాంతర కాల్వలో నీటి సరఫరా లేదన్నారు. అలాగే జలాశయం నుంచి ఎన్టీఆర్ కాల్వకు 875 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 55 క్యూసెక్కులు, వివిధ ఎత్తిపోతల పథకాలకు 872 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కులు వినియోగించామని వివరించారు.

యూరియాకు తప్పని పడిగాపులు

అమరచింత: రైతులు యూరియా కోసం పట్టణంలోని ఆగ్రో రైతు సేవాకేంద్రానికి గురువారం తెల్లవారుజామున 5 గంటలకే చేరుకొని వరుసలో చెప్పులు, రాళ్లు పెట్టడం కనిపించింది. 300 సంచుల యూరియా రాగా.. వచ్చిన రైతులకు పంపిణీ చేసేందుకు వ్యవసాయ, పీఏసీఎస్ అధికారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోలీసులు రైతులను వరుసలో నిల్చోబెట్టి టోకన్లు పంపిణీ చేసి సరఫరా సాఫీగా జరిగేలా చర్యలు తీసుకున్నారు.

పాన్‌గల్‌లో పోలీసుల పర్యవేక్షణలో..



పాన్‌గల్: పట్టణంలోని సింగిల్‌విండో వద్ద రోజు యూరియా పంపిణీ చేస్తున్నా రైతుల రద్దీ మాత్రం తగ్గడం లేదు. గురువారం 450 బస్తాల యూరియా వచ్చిందనే విషయం తెలుసుకున్న వివిధ గ్రామాల రైతులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కాగా కార్యాలయ సిబ్బంది రెండ్రోజుల కిందట టోకన్లు పొందిన రైతులకు ముందుగా పంపిణీ చేశారు. తర్వాత గురువారం వచ్చిన రైతులకు టోకన్లు అందించారు. వచ్చిన యూరియా గంటలోపు అయిపోగా దాదాపుగా 300 మందికిపైగా టోకన్లు జారీ చేశారు.

కురుమూర్తి హుండీ ఆదాయం రూ.7,03,116



చిన్నచింతకుంట: అమ్మాపురం శ్రీ కురుమూర్తి స్వామి ఆలయ హుండీని గురువారం లెక్కించారు. రూ.7,03,116 ఆదాయం వచ్చిందని, ఇది గత నెల అమావాస్య, శని, సోమవారాలను పురస్కరించుకొని భక్తులు స్వామివారికి కానుకలు సమర్పించుకున్నారని ఆలయ కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మధనేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.

7న ఆలయం మూసివేత

ఈ నెల 7వ తేదీన సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా కురుమూర్తిస్వామి ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం మూసివేయనున్నారు. తిరిగి సోమవారం సాయంత్రం 5 గంటలకు ఆలయాన్ని తెరిచి, శుద్ధి చేసిన తర్వాత భక్తులను దర్శనానికి అనుమతించనున్నట్లు అర్చకులు తెలిపారు.

గురువే నమః



- సాంకేతికత, సృజనాత్మకతతో ఆకట్టుకునేలా బోధన
- అన్నిరంగాల్లో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న పలువురు ఉపాధ్యాయులు

నేడు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

చెప్పడం కంటే కళ్లకు కట్టినట్లు చూపిస్తే పిల్లలకు పాఠాలు సులభంగా అర్థమవుతాయన్నది నిజం. పలువురు ఉపాధ్యాయులు కొంతకాలంగా ఇదే విధానాన్ని అవలంబిస్తూ పాఠాలు బోధిస్తూ విద్యార్థులను ఆకట్టుకుంటున్నారు. బోర్డుపై చిత్రాలు గీచి, పాఠ్య పుస్తకాల్లోని ఫొటోలు చూపించి బోధించడంలాంటి మూసధోరణికి స్వస్తి పలికి సాంకేతికతను జోడించి యానిమేషన్ వీడియోల ద్వారా బోధిస్తూ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నారు పలువురు ఉపాధ్యాయులు. పాఠ్యాంశం చాలా కాలం గుర్తుండేలా వినూత్నంగా బోధిస్తూ.. వారిలోని సృజనాత్మకతను వెలికితీసి జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చేలా సంసిద్ధులను చేస్తున్నారు. మొత్తంగా గ్రామీణ విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించేలా తీర్చిదిద్దుతూ పలువురు ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా నిలుస్తున్నారు. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..



స్వయంగా రూపొందించుకున్న తరగతి గది

'డిజిటల్' టీచర్.. సంతోష్‌కుమార్

అమరచింత: సాంకేతికతపై పట్టు సాధించేందుకు నిరంతరం పరితపిస్తుంటారు ఆత్మకూర్ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సంతోష్‌కుమార్. ఆంగ్ల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న ఈయన ప్రత్యేకమైన తరగతి గదిలో ఆంగ్ల అక్షరాలు, ప్రొజెక్టర్ ఏర్పాటు చేసుకొని విద్యార్థులకు బోధన అందిస్తూ ఆంగ్లంలో మెళకువలు నేర్పిస్తూ పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు. గతంలో జిల్లాలో పనిచేసిన కలెక్టర్లు సైతం ఈయనను సత్కరించారు. 1990లో ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరిన సంతోష్‌కుమార్ ఉమ్మడి ఆత్మకూర్ మండలంలో 30 ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు.

ప్రత్యేక తరగతి గదిలో..



విద్యార్థులకు పుస్తకాల్లో ఉన్న విషయాలను నేర్పించడంతో పాటు సాంకేతికంగా కూడా విద్య అందిస్తున్నాం. వాయిస్ టోనింగ్ ద్వారా ఆంగ్లం, తెలుగు భాషలో పదాలు చెప్పడం, విద్యార్థులతో చెప్పించడంతో సులభంగా అర్థమవుతుంది. పాఠశాలలో తన కోసం ప్రత్యేక తరగతి గదిని కేటాయించడంతో ప్రయోగాత్మకంగా డిజిటల్ ఆంగ్ల బోధన సాధ్యమవుతుంది. బోధనే కాకుండా ఆంగ్లంలో రైటింగ్ స్కిల్స్‌ను సైతం నేర్పిస్తున్నా. బోధన పరికరాలకు వేతనం నుంచి కొంత ఖర్చు చేయడంతోనే ఇది సాధ్యమవుతుంది.

– సంతోష్‌కుమార్, ఆంగ్ల ఉపాధ్యాయుడు

దేవన్నకు రాష్ట్రస్థాయి పురస్కారం..



దేవన్న

కొత్తకోట: మండలంలోని అప్పరాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న దేవన్న రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. అందరి ఉపాధ్యాయులుగా కాకుండా తాను ప్రత్యేకంగా ఉండాలన్న ఆయన తపన రాష్ట్రస్థాయి గుర్తింపునకు కారణమైంది. జిల్లా, రాష్ట్రస్థాయిలో సాంఘికశాస్త్ర ఫోరం నిర్వహించే ప్రతిభా పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు దేవన్న ఎంతో కృషి చేశారు. గ్రామస్తులు, పూర్వ విద్యార్థుల చేయూతతో పాఠశాలలో మైక్‌సెట్, డ్యూయల్ డెస్క్ బేంచీలు, ప్రింటర్, అనేక పుస్తకాలు, గోడలపై రాష్ట్ర, దేశపటాలు, జాతీయ నాయకుల చిత్రచిత్రాలు గీయించడంలో ఆయన ముఖ్య పాత్ర పోషించారు.

ఈ సారు.. బడిని మార్చారు

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన విష్ణువర్ధన్‌నాయుడు



నాగరాల పాఠశాల గోడలపై పదాలు రాస్తున్న ఉపాధ్యాయుడు విష్ణువర్ధన్‌నాయుడు

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలం పెంచికలపాడుకు చెందిన ఎస్.విష్ణువర్ధన్‌నాయుడు 2010లో ఎస్జీటీగా ఎంపికై మాగనూర్ మండలం ఓబులాపురం గ్రామ ప్రాథమిక పాఠశాలలో చేరారు. అక్కడి నుంచి 2015లో పెబ్బేరు మండలం సూగూరు ప్రాథమిక పాఠశాలకు బదిలీపై వచ్చారు. ఈ పాఠశాలలో వాల్ పెయింటింగ్ చేయించి విద్యార్థులకు వినూత్న బోధన అందిస్తూ ప్రజల మన్ననలు పొందారు. అక్కడి నుంచి 2024లో శ్రీరంగాపురం మండలం నాగరాల 3వ కేంద్రం ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయ్యారు. ఇక్కడ ఏకోపాధ్యాయుడిగా విధుల్లో చేరి ఒకేగదిలో ఇద్దరు విద్యార్థులతో తరగతులు ప్రారంభించారు. తన స్నేహితుల సాయంతో పాఠశాలకు రంగులు వేయించి సామగ్రి సమకూర్చుకున్నారు. ఇతడికి పెయింటింగ్‌పై ఆసక్తి ఎక్కువ. పాఠశాల గోడలపై తెలుగు వర్ణమాల, ఇంగ్లిష్ అల్ఫాబెట్, అంకెలు, బొమ్మలు వేసి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా పాఠాలు బోధిస్తున్నారు. ప్రస్తుతం పాఠశాలలో విద్యార్థులకు సంఖ్య 16కి చేరింది. ఈయన కృషికిగాను ప్రభుత్వం ఆయనను రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవార్డుకు ఎంపిక కావడం చాలా గర్వంగా ఉందని.. అవార్డు నాపై మరింత బాధ్యత పెంచిందన్నారు. నా సేవలను విద్యాశాఖ గుర్తించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

ప్రయోగాల మాస్టారు మల్లేష్



ప్రయోగాల ద్వారా విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయులు మల్లేష్‌కుమార్ (ఫైల్)

పాన్‌గల్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల జీవశాస్త్రం ఉపాధ్యాయుడు మల్లేష్ కుమార్ తన వినూత్న బోధనతో విద్యార్థులను ఆకట్టుకుంటున్నారు. ఈయనకు ప్రయోగాల మాస్టారుగా పేరుంది. సైన్స్ ప్రయోగాల ద్వారా విద్యార్థి సంపూర్ణంగా నేర్చుకుంటారని చెబుతుంటారాయన. గుండె, మూత్రపిండాలు, జ్ఞానేంద్రియాలు మొదలగు అవయవాలను డిజిటల్ బోర్డుపై చూపిస్తూ బోధిస్తుంటారు.

⇨ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎన్‌జీసీ ఏకో క్లబ్ ఆధ్వర్యంలో కిచెన్ గార్డెన్స్ అభివృద్ధి, వన మహోత్సవం, ప్రపంచ పర్యావరణ దినోత్సవం, ప్రపంచ జల దినోత్సవం, ప్లాస్టిక్ నిషేధం వంటివి నిర్వహించి పిల్లలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్నారు. స్వచ్ఛతలో భాగంగా పిల్లలు చేతులు శుభ్రం చేసుకునే విధానం, మరుగుదొడ్లను వినియోగించడం, నులిపురుగులు, అంటువ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తున్నారు.

⇨ ఎకో క్లబ్‌లో భాగంగా మట్టి గణపతులు, పేపర్ బ్యాగుల తయారీ , ఏకో రాఖీ, ఇంకుడు గుంతల నిర్మాణంపై అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థులు పాఠశాల, మండల, జిల్లాస్థాయి సైన్స్ మేళాల్లో పాల్గొనేలా సిద్ధం చేస్తుంటారు. సైన్స్, బాలల, గణిత దినోత్సవం సందర్భంగా పిల్లలకు వ్యాసరచన, ఉపన్యాస, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తారు.

⇨ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించి విద్యార్థుల ప్రగతిపై చర్చించడంతో పాటు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతారు.

భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం..

శాస్త్ర సాంకేతిక రంగాల్లో విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యం. అందుకు అనుగుణంగా వినూత్న పద్ధతులను అవలంబిస్తూ విద్యార్థులకు బోధిస్తూ ఆయా లక్ష్యాల వైపు మళ్లించేందుకు కృషి చేస్తున్నా.

– మల్లేష్‌కుమార్, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు, జెడ్పీ ఉన్నత పాఠశాల, పాన్‌గల్

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు 56 మంది

- శనివారం పురస్కారాల అందజేత

వనపర్తిటౌన్: జిల్లావ్యాప్తంగా 56 మంది ఉత్తమ ఉపాధ్యాయును ఎంపిక చేసినట్లు జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘనీ గురువారం రాత్రి తెలిపారు. ఏ ప్రాతిపదికన, ఏయే అంశాలు పరిగణలోకి తీసుకొని ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేయాలని ఉదయం నుంచి పలు ఉపాధ్యాయ సంఘాలతో ఆయన విస్తృతంగా చర్చించారు. డీఈఓ కార్యాలయంలో అదనపు బాధ్యతలు, ఫారెస్ట్ సర్వీస్‌లో విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధుల కనుసన్నల్లో ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక ప్రక్రియ కొనసాగినట్లు ప్రచారం సాగింది. గురువారం రాత్రి 9 వరకు కూడా కసరత్తు ఓ కొలిక్కి రాలేదు. మండలాల వారీగా, సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకొని డీఈఓ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎంపిక కమిటీ కసరత్తు చేసినట్లు తెలుస్తోంది. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా శుక్రవారం ప్రభుత్వ సెలవురోజు కావడంతో ఎంపిక వివరాలు వెల్లడించకుండా గోప్యంగా ఉంచాలని అధికారులు నిర్ణయించినట్లు చెబుతున్నారు. రాజకీయ ఒత్తిళ్లు వచ్చే అవకాశం ఉందనే ఉద్దేశంతో డీఈఓ వివరాలు వెల్లడించేందుకు ఇష్టపడటం లేదని విద్యాశాఖలో ప్రచారం జరుగుతోంది. ఒక గజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు, 24 మంది స్కూల్ అసిస్టెంట్లు, 21 మంది ఎస్జీటీలు, నలుగురు ఎల్ఎఫ్ఎల్ ఉపాధ్యాయులు, ఇద్దరు మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు, కేజీబీవీ ఉపాధ్యాయులు ముగ్గురు, ఒక పీడీ ఉన్నారు. ఈసారి మోడల్ స్కూల్, కేజీబీవీ ఉపాధ్యాయులకు ఉత్తమ పురస్కారాలు తొలిసారిగా వరించాయి.

విశేష సేవలకు గుర్తింపు

పీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డికి రాష్ట్రస్థాయి అవార్డు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో కొన్ని సంవత్సరాలుగా అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తూ.. పీజీ కళాశాల ప్రిన్సిపాల్, ఐక్యూఏసీ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ అధ్యాపకుడిగా అవార్డును ప్రకటించింది. ఆయన యూజీ, పీజీ స్థాయిలో పనిచేయడంతోపాటు ఆయన చేసిన 35 పరిశోధనలకు జాతీయ, అంతర్జాతయ స్థాయిలో రీసెర్చ్ పత్రాలను సమర్పించారు. 11పుస్తకాలను జాతీయ, అంతర్జాతీయ పబ్లిషర్స్ పబ్లిష్ చేశాయి. ఆయన చేసిన రెండు రీసెర్చ్‌లకు రూ.56లక్షలతో ప్రాజెక్టులు వచ్చాయి. దీంతోపాటు పీయూ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో రిజిస్ట్రార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, వీసీ ఓఎస్డీ, ఐక్యూఏసీ డైరెక్టర్, బోర్డు ఆఫ్ స్టడీస్ డైరెక్టర్‌తో పాటు ఐదుగురు వీసీలు, ఏడుగురు రిజిస్ట్రార్ల వద్ద అడ్మినిస్ట్రేషన్ పరంగా విధులు నిర్వహించడంతో ఆయనకు ప్రభుత్వం అవార్డును ప్రకటించింది.

ఎఫ్‌డీఆర్ నిధులు ఖర్చు చేయాలి

వనపర్తి: జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో భారీ వర్షాలు, వరదలతో జరిగిన నష్టాలకు కేంద్ర విపత్తు నిర్వహణ ద్వారా మంజూరైన రూ.3 కోట్లను ఖర్చుచేసి యూసీలు సిద్ధం చేసి పంపించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గత వర్షాకాలంలో వరదలతో ఎక్కడెక్కడ నష్టం వాటిల్లింది.. వాటి మరమ్మతుకు ఖర్చు చేసిన బిల్లులు సిద్ధం చేయాలన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో విద్య, రహదారులు, భవనాలు, సంక్షేమ, వైద్య, ఆరోగ్యశాఖ, నీటిపారుదల, మున్సిపాలిటీ తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి నష్టాలు, చేపట్టిన మరమ్మతుపై చర్చించారు. పనులు ఎంత మేర పూర్తయ్యాయి, ఎన్ని పురోగతిలో ఉన్నాయన్న వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. నెలాఖరు వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ఇటీవల కురిసిన వర్షాలకు ఎక్కడెక్కడ ఎంత నష్టం వాటిల్లిందో నివేదిక అందజేయాలని, వాటి మరమ్మతుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలని ఆదేశించారు. సమీక్షలో జిల్లా విద్యాధికారి మమ్మద్ ఘనీ, జిల్లా వైద్యాధికారి డా. శ్రీనివాసులు, పుర కమిషనర్లు, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ అధికారులు, డి–సెక్షన్ సూపరింటెండెంట్ మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



కడుకుంట్ల పీహెచ్‌సీలో వివరాలు పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

యూరియా కొరత లేదు..

వనపర్తి రూరల్: యూరియా కోసం సింగిల్‌విండో చైర్మన్లు సకాలంలో డీడీలు చెల్లించి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. గురువారం మండలంలోని పెద్దగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాంను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు, యూరియా నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు ప్రస్తుత అవసరాలకు సరిపడా కొనుగోలు చేయాలని సూచించారు. గతేడాది కంటే ఈసారి ఎక్కువ యూరియా వచ్చిందని, పాత నిల్వలు సైతం ఉన్నాయని తెలిపారు. నిరంతరం సరఫరా అవుతుందని.. ఆందోళన అవసరం లేదన్నారు. అనంతరం కడుకుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీచేసి మధుమేహం, క్షయ వ్యాధిగ్రస్తుల వివరాలను జిల్లా హెల్త్ యాప్‌లో పరిశీలించారు. ప్రతి ఒక్కరి వివరాలు సరిగా నమోదు చేయాలని, వారి సెల్‌నంబర్లు సరిగా ఉన్నాయా లేవా అనేది ఆశా కార్యకర్తలు ఇల్లిల్లూ తిరిగి తనిఖీ చేయించాలని ఆదేశించారు. ఆస్పత్రిలోని బాలింతలతో మాట్లాడి వైద్యసేవలు, వసతులపై ఆరా తీశారు. ఆస్పత్రి భవన మరమ్మతులు ఏమైనా ఉంటే ప్రతిపాదనలు ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులుగౌడ్, జిల్లా వైద్యాధికారి డా. శ్రీనివాసులు, ప్రోగ్రాం అధికారి డా. సాయినాథ్‌రెడ్డి, డా. పరిమళ, తహసీల్దార్ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతియుత వాతావరణంలో నిమజ్జనం



నల్ల చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

- ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి: భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర నిర్వహించి గణనాథులకు ఘనమైన వీడ్కోలు పలుకుదామని ఎస్పీ రావుల గిరిధర్ సూచించారు. శుక్రవారం గణేష్ నిమజ్జనం సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, ప్రమాదాలు జరగకుండా పటిష్ట భద్రత, బందోబస్తు కల్పిస్తున్నట్లు వివరించారు. గురువారం ఆయన జిల్లాకేంద్రంలోని నల్లచెరువు వద్ద నిమజ్జనం జరిగే ప్రదేశం, శోభాయాత్ర జరిగే మార్గాల్లో ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం పూర్తయ్యేలా నిర్వాహకులు పోలీసుల సూచనలు పాటించాలన్నారు. ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో రహదారుల మరమ్మతు, ఫ్లడ్ లైట్లు, క్రేన్లు, తాగునీటి వసతి కల్పించామని, నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో గజ ఈతగాళ్లు అందుబాటులో ఉంటారని తెలిపారు. అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఊరేగింపు కొనసాగుతుందని.. నిర్వాహకులు పూజలు త్వరగా ముగించి వెలుతురు ఉండగానే విగ్రహాలను జాగ్రత్తగా తరలించాలని సూచించారు. చిన్నపిల్లలు, మహిళలు శోభాయాత్రలో పాల్గొంటే ప్రమాదాలు జరగకుండా చూడాలని, ట్రాక్టర్లు, లారీలు, ఇతర వాహనాలపై వచ్చే చిన్నారులు జాగ్రత్తగా ప్రయాణించాలన్నారు. క్రేన్ సాయంతో నిమజ్జనం చేసే సమయంలో యువత, చిన్నారులు, మహిళలు అప్రమత్తంగా ఉండాలని, సహాయకులు అందుబాటులో ఉండాలన్నారు. శోభాయాత్రలో డీజేలు, బాణసంచా వినియోగించడం నిషేధమని.. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిమజ్జన కార్యక్రమం శాంతియుత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట పుర కమిషనర్ వెంకటేశ్వర్లు, వనపర్తి సీఐ కృష్ణయ్య, రిజర్వ్ సీఐ శ్రీనివాస్, వనపర్తి పట్టణ ఎస్ఐ హరిప్రసాద్, పుర, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

రైస్‌మిల్లుల ఏర్పాటులో నిబంధనలు తప్పనిసరి

రెవెన్యూ అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ వివరాలు పరిశీలిస్తున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

ఖిల్లాఘనపురం: జిల్లాలో కొత్త రైస్‌మిల్లులు ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఏర్పాటు చేసుకోవాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ సూచించారు. గురువారం మండలంలోని మొగులుకుంటతండా సమీపంలో నిర్మాణంలో ఉన్న రైస్ మిల్లును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే వరి ధాన్యాన్ని సకాలంలో మర ఆడించి ఎఫ్‌సీఐకి సీఎంఆర్ అప్పగించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో మిల్లులోని ధాన్యం నిల్వలో తేడాలు ఉండొద్దన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు..

భూ రిజిస్ట్రేషన్లకు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే రైతులు ఇబ్బందులు పడకుండా తగిన ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి వివిధ పనుల నిమిత్తం వచ్చిన రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. రోజుల తరబడి తిప్పించుకోకుండా సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని కోరారు. దాతల సహకారంతో కార్యాలయం వెలుపల బెంచీలు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు.

అధికంగా వసూలు చేస్తే చర్యలు..

మీ–సేవా కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి అధికంగా డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ హెచ్చరించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయానికి రిజిస్ట్రేషన్‌కు వచ్చిన ఓ రైతుతో మాట్లాడి మీ సేవా వారు ఎన్ని డబ్బులు తీసుకున్నారని అడిగారు. రూ.2,200 చెల్లించామని చెప్పగా.. 0.13 ఎకరాలకు రూ.850 తీసుకోవాల్సి ఉండగా అన్ని డబ్బులు ఎందుకు వసూలు చేశారని తహసీల్దార్‌ను ప్రశ్నించారు. సదరు కేంద్రం నిర్వాహకుడితో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకోవాలని ఆదేశించారు. అనంతరం రికార్డుగదిని పరిశీలించారు. పాతవి తొలగించి కొత్తవాటిని ఉంచాలని చెప్పారు. ఆయనవెంట పౌరసరఫరాలశాఖ అధికారి కాశీవిశ్వనాథం, తహసీల్దార్ సుగుణ, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీకాంత్, సీనియర్ అసిస్టెంట్ కురుమూర్తి, ఆర్ఐ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గల్లంతైన దంపతుల మృతదేహాలు లభ్యం



తాటికుంట రిజర్వాయర్‌లో లభ్యమైన రాముడు, సంధ్య మృతదేహాలు

మల్దకల్: రిజర్వాయర్‌లో పుట్టీ సాయంతో చేపలు పట్టేందుకు వెళ్లిన దంపతులు గల్లంతు కాగా.. గురువారం వారి మృతదేహాలు లభ్యమయ్యాయి. పూర్తి వివరాలిలా.. మల్దకల్ మండలంలోని తాటికుంట రిజర్వాయర్‌లో మంగళవారం సాయంత్రం దంపతులు బోయ దుబ్బోనిబాయి రాముడు, సంధ్య చేపలవేటకు ఎంతకూ తిరిగి ఇంటికి రాకపోవడంతో వారి ఆచూకీ కోసం రెండు రోజుల పాటు ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, గజ ఈతగాళ్లు రిజర్వాయర్‌లో గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు గురువారం తెల్లవారుజామున దంపతుల మృతదేహాలు నీటిలో తేలుతూ కనిపించడంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అధికారులకు సమాచారం అందించారు. అనంతరం మల్దకల్ పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నందీకర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

నవాబుపేట: పంట పొలానికి వేసిన విద్యుత్ కంచె తగిలి మహిళ మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని జంగమయ్యపల్లికి చెందిన కంచె కిష్టమ్మ(40) గ్రామ సమీపంలో కుమ్మరి రాములు వ్యవసాయ పొలంలో మొక్కజొన్న పంటకు వేసిన విద్యుత్ కంచె వల్ల షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు కుటుంబ సభ్యులు సమాచారం అందించగా కిష్టమ్మ కుమారుడు నరేష్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

తండ్రిపై కుమారుడి దాడి: కారు డిక్కీలో తరలింపు

కల్వకుర్తిటౌన్: వ్యవసాయ పొలం వద్ద ఉన్న కన్నతండ్రిపై కర్రతో దాడిచేసి అక్కడి నుంచి కారులో డిక్కీలో తరలించిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లో వెళ్తే.. పట్టణంలోని వాసవీనగర్‌లో నివాసముంటున్న రైతు బాలయ్య(70) పొలం వద్ద ఉండగా.. బుధవారం సాయంత్రం కుమారుడు బీరయ్య తండ్రిపై కర్రతో దాడిచేసి కారు డిక్కీలో వేసుకొని పరారయ్యాడు. రాత్రివరకు బాలయ్య ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికినా.. ఎక్కడా ఆచూకీ దొరకలేదు. దీంతో గురువారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా.. రక్తపు మరకలు ఉన్నట్లు గుర్తించారు. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా.. కుమారుడు బీరయ్యనే దాడి చేసి కారులో తీసుకెళ్లినట్లు గుర్తించి అతనికోసం గాలిస్తున్నారు. 24గంటలు గడిచినా వృద్ధుడి ఆచూకీ లభించకపోవడం, దాడికి పాల్పడిన కుమారుడు పరారీలో ఉండడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై కల్వకుర్తి సీఐ నాగార్జునను వివరణ కోరగా.. గాయపడ్డ వృద్ధుడిని ఆస్పత్రిలో చేర్పించాడా? లేదా ఏమైనా చేశాడనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జగదీశ్వర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం



మాజీ ఎమ్మెల్సీ జగదీశ్వర్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, కుటుంబసభ్యులు

- రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- ఆయనది ఎంత ఎదిగినా ఒదిగి ఉండే నైజం: మంత్రి వాకిటి శ్రీహరి
- పాలమూరులో మాజీ ఎమ్మెల్సీ జగదీశ్వర్‌రెడ్డి విగ్రహావిష్కరణ

స్టేషన్ మహబూబ్‌నగర్: మాజీ ఎమ్మెల్సీ జగదీశ్వర్‌రెడ్డి ఉమ్మడి జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా పదేళ్లపాటు సుదీర్ఘకాలంగా పని చేశారని, పార్టీ యంత్రాంగాన్ని నడపాలంటే ఆయన్ను చూసి నేర్చుకోవాలని, పార్టీకి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మహబూబ్‌నగర్ పద్మావతీకాలనీలోని గ్రీన్‌బెల్టులో గురువారం మాజీ ఎమ్మెల్సీ ఎస్.జగదీశ్వర్‌రెడ్డి విగ్రహావిష్కరణలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎంపీ, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ పార్టీ పరమైన అంశాల్లో, ఇతర సమస్యల్లో ఎవరి మనసు నొప్పించక ప్రజాస్వామికబద్ధంగా వ్యవహరించేవారని అన్నారు. ఆనాడు పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో జిల్లా నుంచి ప్రధాన పాత్ర పోషించారని అన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ జగదీశ్వర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో అంచలంచెలుగా ఎదిగారని అన్నారు. రాజకీయాలకు సరైన వ్యక్తిగా ఆయన జీవన ప్రయాణం కొనసాగిందన్నారు. జీవితంలో ఎంత ఎదిగినా ఒదిగి ఉండడం ఆయననే చూసే నేర్చుకోవడం జరిగిందన్నారు. ఎంపీ డాక్టర్ మల్లురవి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి మాట్లాడుతూ జగదీశ్వర్‌రెడ్డి ఆదర్శప్రాయుడని, కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలు అందించారని అన్నారు. సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ జగదీశ్వర్‌రెడ్డితో తనకు ఎంతో ఆత్మీయత అనుబంధం ఉందన్నారు. మొదట్లో నాకు రాజకీయాలు వద్దని చెప్పారని, తర్వాత నాకున్న ఆసక్తితో రాజకీయాల్లో ఎంతో ప్రోత్సహించారని గుర్తుచేశారు. మాజీ ఎంపీ వి.హనుమంతురావు మాట్లాడుతూ జగదీశ్వర్‌రెడ్డి నిరుపేదలకు సహాయం చేయడంలో ముందుండేవారని అన్నారు. ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, యశస్వినిరెడ్డి, కార్పొరేషన్‌ల చైర్మన్లు గురునాథ్ రెడ్డి, ఒబేదుల్లా కొత్వాల్, కోదండారెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు భానుప్రకాశ్, యాదవరెడ్డి తదితరులు జగదీశ్వర్‌రెడ్డి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, బెక్కరి మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ నందిని, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, సంజీవ్ ముదిరాజ్, వినోద్‌కుమార్, ఎన్‌పీ. వెంకటేశ్, చంద్రకుమార్‌గౌడ్, భగవంతురావు, సీజే బెనహర్, ప్రశాంత్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, జహీర్ అఖ్తర్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ పోటీలు



క్వాలిఫైయింగ్ రౌండ్ మ్యాచ్‌ల్లో తలపడుతున్న క్రీడాకారులు

క్వాలిఫైయింగ్ రౌండ్ మ్యాచ్‌లు పూర్తి
- నేటి నుంచి మెయిన్ డ్రా పోటీలు
- ప్రేక్షకులతో కిటకిటలాడిన ఇండోర్ స్టేడియం

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో 11వ రాష్ట్రస్థాయి జూనియర్ (అండర్–13) బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌కు సంబంధించి 225 క్వాలిఫైయింగ్ రౌండ్ మ్యాచ్‌లు గురువారం ఉత్సాహంగా జరిగాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. క్వాలిఫైయింగ్ మ్యాచ్‌ల్లో ప్రతిభ కనబరిచిన వారు శుక్రవారం నుంచి జరిగే మెయిన్ డ్రాకు అర్హత సాధించారు.

శుక్రవారం ఉదయం ప్రారంభోత్సవం...

రాష్ట్రస్థాయి అండర్–13 బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానున్నాయని మహబూబ్‌నగర్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంసుందర్‌గౌడ్, రవికుమార్ తెలిపారు. ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న క్వాలిఫైయింగ్ మ్యాచ్‌లను వారు పరిశీలించారు. నాలుగు సింథటిక్ కోర్టుల్లో సింగిల్, డబుల్స్ పోటీలు జరుగుతాయని, ఈ నెల 7న చాంపియన్‌షిప్ ముగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించామన్నారు. కార్యక్రమంలో టోర్నీ పరిశీలకుడు సుధాకర్, రెఫరీ కిషోర్, జిల్లా సంయుక్త కార్యదర్శులు నాగరాజుగౌడ్, విజయ్‌రెడ్డి, ఎంపీ.ప్రవీణ్, సభ్యులు శశాంక్ పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయానికి అటవీ భూమి

ఆలయ కమిటీ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి



సమస్య పరిష్కారంపై వివరాలు ప్రకటిస్తున్న ఆలయ చైర్మన్, సభ్యులు

నవాబుపేట: జిల్లాలో ప్రసిద్ధిచెందిన పర్వాతాపూర్ మైసమ్మ ఆలయానికి అటవీ భూమి కోసం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ద్వారా ప్రత్యేక ప్రతిపాదన చేసినట్లు మైసమ్మ ఆలయ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. మైసమ్మ ఆలయానికి అదనంగా 4.0889 హెక్టార్ల (దాదాపు పది ఎకరాలు)అటవీ భూమి కోసం ప్రత్యేక వినతిని జడ్చర్ల ఎమ్మెల్యే ప్రతిపాదించినట్లు తెలిపారు. దీనికి సంబంధించి కలెక్టర్ అటవీ భూమిలో సంబంధిత అధికారులతో సర్వే చేయించి అనుమతులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. కాగా, కేంద్ర కార్యాలయం తుది అనుమతి రావాల్సి ఉందని.. దీనికి త్వరలోనే అనుమతులు తీసుకొచ్చేలా చేస్తానని జడ్చర్ల ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలియజేశారు.

ఆలయ సిబ్బందికి పెరిగిన వేతనాలు

కొన్నేళ్లుగా ఆలయంలో వివిధ రకాల పనులు చేస్తున్న వారికి కనీస వేతనాలు పనికి తగ్గట్లుగా అందేవి కావు. దీంతో వారు చాలా ఏళ్లుగా కనీస వేతనం కోసం జడ్చర్ల ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించడంతో తాజాగా 6 కూలీలకు కనీస వేతనం అందించే జీఓ బుధవారం వచ్చిందని మైసమ్మ ఆలయ చైర్మన్ తెలిపారు. దీంతో గతంలో నెలకు రూ.7500 అందించే వేతనాన్ని రూ.12వేలకు పెంచినట్లు పేర్కొన్నారు. అలాగే వంశపారంపర్యంగా ఆలయంలో పనులు చేసే మరో వ్యక్తికి సంబంధించి పర్మినెంట్ వేతనం మంజూరు చేస్తూ ప్రభుత్వం గజిట్ ఇచ్చిందని తెలిపారు. దీంతో ఆలయంలో ఉన్న పెండింగ్ సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం అవుతున్నాయని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు చైర్మన్‌తోపాటు సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు ఇబ్బంది లేకుండా పంపిణీ చేయాలి



హాకా రైతుసేవా కేంద్రం వద్ద పంపిణీ గురించి చైర్మన్ కోదండరెడ్డికి వివరిస్తున్న అధికారులు

రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా యూరియా పంపిణీ చేయాలని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం మహబూబ్‌నగర్ అర్బన్ మండల పరిధిలోని బోయపల్లిరోడ్‌లో గల హాకా రైతు సేవా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా యూరియా పంపిణీ ప్రక్రియను మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. యూరియా కొరత లేకుండా చూసుకోవాలని, రైతులు గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఒకరోజు ముందుగానే టోకన్లు ఇచ్చి యూరియా పంపిణీ చేస్తున్నామని అధికారులు కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. అందరికీ టోకెన్లు వచ్చేలా చూడాలని, మహిళలకు, వృద్ధులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. యూరియా పక్కదారి పట్టకుండా పంపిణీ చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, జిల్లా వ్యవసాయశాఖ అధికారికి చైర్మన్ ఫోన్ చేసి యూరియా పంపిణీ, భూ భారతి చట్టం అమలు తీరుపై ఆరా తీశారు. రైతులకు ఒకే కేంద్రానికి కేంద్రానికి రాకుండా ఎక్కడి వారికి అక్కడే పంపిణీ జరిగేలా చూడాలని కలెక్టర్, డీఏఓలకు సూచించారు. రాష్ట్రంలో యూరియా కొరత లేకుండా ప్రభుత్వం, అధికార యంత్రాంగం చర్యలు చేపడుతున్న విషయాల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో అధికారులు, సేవా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డైవర్షన్ పనులు పక్కాగా చేపట్టాలి

కేంద్ర అటవీశాఖ డీజీ చంద్రశేఖర్



చిన్నదర్పల్లి బీట్ పరిధిలో అటవీభూమి, చెట్లను పరిశీలిస్తున్న డీజీ చంద్రశేఖర్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: చిన్నదర్పల్లి ఫారెస్ట్ బీట్ పరిధిలోని జాతీయ రహదారి విస్తరణలో ఫారెస్ట్ డైవర్షన్ పనులు పక్కాగా చేపట్టాలని కేంద్ర అటవీశాఖ డీజీ చంద్రశేఖర్ జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రానికి సమీపంలోని చిన్నదర్పల్లి ఫారెస్ట్ బీట్ పరిధిలో జాతీయ రహదారి విస్తరణలో కోల్పోతున్న అటవీ భూమి, చెట్లను ఆయన పరిశీలించారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల నష్టానికి సంబంధించి ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా డైవర్షన్ పనులు పక్కాగా చేపట్టాలని డీఎఫ్‌ఓ సత్యనారాయణకు సూచించారు. విస్తరణలో పోతున్న అటవీ భూమికి బదులుగా మరోచోట ఇవ్వడం, చెట్లకు బదులుగా మరోచోట నాటడం వంటి పనుల్లో ఎలాంటి జాప్యం జరగరాదని సూచించారు. అనంతరం మహబూబ్‌నగర్ సమీపంలోని దొడ్డలోనిపల్లి ఫారెస్ట్ బీట్ పరిధి ప్లాంటేషన్, మయూరీ పార్క్‌ను సందర్శించారు. పార్క్‌లో ఏర్పాట్లు, మొక్కలు, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో రేంజ్ అధికారి అబ్దుల్‌హాయ్, జాతీయ రహదారి ఈఈ తదితరులు పాల్గొన్నారు.



మయూరీ పార్క్‌ను పరిశీలిస్తున్న అటవీ డీజీ

దిగువ జూరాలలో సోలార్ కేంద్రం

జెన్‌కో సీఎండీ డా. హరీశ్



దిగువ జూరాల జల విద్యుత్ కేంద్రంలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న జెన్‌కో సీఎండీ డా. హరీశ్

ఆత్మకూర్: రాష్ట్రంలోని విద్యుదుత్పత్తి కేంద్రాల వద్ద అవకాశం ఉన్నచోట సోలార్ కేంద్రాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని టీఎస్ జెన్‌కో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డా. హరీశ్ తెలిపారు. గురువారం జూరాల ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాలను సందర్శించారు. దిగువ జూరాల వద్ద 100 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని.. 20 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టుకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. అలాగే కొత్తగూడెంలో కూడా సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుకు అవకాశాలు ఉన్నాయని, త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ ఏడాది దిగువ జూరాలలో రికార్డుస్థాయిలో విద్యుదుత్పత్తి చేపట్టి లక్ష్యాన్ని అధిగమించడం అభినందనీయమన్నారు. ఎగువన కూడా లక్ష్యానికి చేరువలో ఉన్నారని చెప్పారు. బదిలీలు చేపట్టాలని, ఖాళీలను భర్తీ చేయాలని ఉద్యోగులు సీఎండీని అభ్యర్థించగా త్వరలో చేపడతామని హామీ ఇచ్చారు. ఆయన వెంట డైరెక్టర్ బాలరాజు, ఎస్‌ఈలు శ్రీధర్, సురేష్, సిబ్బంది ఉన్నారు.

జూరాలకు కొనసాగుతున్న వరద

8 క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల



జూరాల నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

ధరూరు/ఆత్మకూర్/రాజోళి/దోమలపెంట: ప్రియదర్శిని జూరాల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద నిలకడగా కొనసాగుతోందని పీజేపీ అధికారులు తెలిపారు. బుధవారం 1,02,950 క్యూసెక్కులు ఉండగా.. గురువారం రాత్రి 8.30 ప్రాంతంలో 92 వేల క్యూసెక్కుల తగ్గినట్లు చెప్పారు. దీంతో ప్రాజెక్టు 8 క్రస్ట్‌గేట్లను ఎత్తి 55,928 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తికి 40,324, ఆవిరి రూపంలో 70, ఎడమ కాల్వకు 920, కుడి కాల్వకు 670, భీమా లిఫ్ట్‌కు 750 క్యూసెక్కులు వినియోగిస్తున్నట్లు వివరించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.651 టీఎంసీలు ఉన్నట్లు తెలిపారు.

586.515 మి.యూ. విద్యుదుత్పత్తి..

జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో గురువారం ఉత్పత్తి వేగవంతంగా కొనసాగిందని ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 6 యూనిట్ల నుంచి 234 మెగావాట్లు, 279.387 మి.యూ., దిగువ 6 యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 307.128 మి.యూ. విద్యుదుత్పత్తి చేపట్టామని, ఇప్పటి వరకు 586.515 మి.యూ. విజయవంతంగా పూర్తి చేసినట్లు వివరించారు.

సుంకేసులకు కొనసాగుతున్న వరద..

సుంకేసుల జలాశయానికి గురువారం ఎగువ నుంచి 73 వేల క్యూసెక్కుల వరద రాగా.. 17 గేట్లను మీటర్ మేర తెరిచి 70,312 క్యూసెక్కులు దిగువకు వదిలినట్లు జేఈ మహేంద్ర వివరించారు. అలాగే 2,626 క్యూసెక్కులు కేసీ కెనాల్‌కు సరఫరా చేసినట్లు తెలిపారు.

శ్రీశైలం మూడు గేట్లు ఎత్తి..

ఎగువ నుంచి వస్తున్న నీటి ప్రవాహం పెరగడంతో గురువారం శ్రీశైలం ఆనకట్ట మూడు గేట్లు ఒక్కొక్కటి పది అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని వదిలారు. జూరాల స్పిల్‌వే నుంచి 55,928 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 40,324 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 67,872 క్యూసెక్కుల వరద జలాశయం చేరుతుందని.. జలాశయం స్పిల్‌వే ద్వారా 82,710 క్యూసెక్కులు, భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 31,012 క్యూసెక్కులు దిగువనున్న నాగార్జునసాగర్‌కు వదిలినట్లు అధికారులు వివరించారు. ప్రస్తుతం జలాశయంలో 883.9 అడుగుల నీటి మట్టం.. 209.1579 టీఎంసీల నీటి నిల్వ ఉందని చెప్పారు. భూగర్భ కేంద్రంలో 17.179 మి.యూ., కుడిగట్టు కేంద్రంలో 15.608 మి.యూ., విద్యుదుత్పత్తి చేశారు.

మహిళ మెడలో మంగళసూత్రం చోరీ



మహిళ వెనకాల వస్తున్న వ్యక్తి



బైక్‌పై పరారవుతున్న దొంగలు

బైక్‌పై పరారైన దొంగలు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేట ఫ్రీజన్ రోడ్డులో గురువారం గోదా నాగలక్ష్మి అనే మహిళ మెడలో గుర్తు తెలియని దుండగులు పుస్తెలతాడు (బంగారుగొలుసు) చోరీ చేశారు. స్థానికంగా నివాసముంటున్న నాగలక్ష్మి రేషన్ దుకాణానికి వెళ్లి ఇంటికి తిరిగి వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ఆమెను ఫాలో అవుతూ వచ్చాడు. నిర్మానుష ప్రాంతంలో మెడలోని గొలుసు చోరీ చేసినట్లు బాధితురాలు తెలిపారు. అనంతరం ఎన్‌ఎస్125 బైక్‌పై సిద్ధంగా ఉన్న మరో దుండగుడితో కలసి పరారైనట్లు పేర్కొన్నారు. బాధితురాలు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ మల్లేష్ సంఘటనా స్థలానికి చేరుకొని సమీపంలోని సీసీ కెమెరాల రికార్డులు పరిశీలించారు. చోరీ అయిన గొలుసు మూడు తులాలు ఉంటుందని బాధితురాలు వాపోయింది.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 12 తులాల బంగారు, 2 కేజీల వెండి ఆభరణాలు అపహరణ

నాగర్‌కర్నూల్ క్రైం: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన మున్సిపాలిటీ పరిధిలోని నాగనూలులో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన జాలం బాలమ్మ భర్త నర్సింహతో కలిసి బుధవారం జిల్లా కేంద్రంలోని పెద్దమ్మ ఇంటికి వెళ్లి రాత్రికి అక్కడే ఉన్నారు. గురువారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా తలుపులు విరగ్గొట్టి ఉండటంతో పాటు బీరువాలోని వస్తువులు చిందర వందరగా పడి ఉండటాన్ని గమనించారు. గుర్తు తెలియని వ్యక్తులు బీరువాలోని 12 తులాల బంగారు, 2 కేజీల వెండి ఆభరణాలు, రూ.11 వేల నగదు చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు

నవాబుపేట: చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతైన ఘటన మండలకేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. దేపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ జావిద్ (35), బుచ్చయ్య ఇద్దరు బుధవారం చేపల వేటకు వెళ్లారు. కాగా జావిద్ చేపల పట్టుకునే క్రమంలో చెరువు లోపలికి వెళ్లి ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. బుచ్చయ్య గమనించి గ్రామస్తులకు సమాచారం అందించాడు. గ్రామస్తులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్‌ఐ విక్రమ్ గజ ఈతగాళ్లను రంగంలోకి దింపి మరో సారి గాలింపుచర్యలు చేపట్టారు. రాత్రి వరకు గాలించినా ఆచూకీ లభించకపోవడంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. కాగా జావిద్‌కు భార్య అన్వర్‌తో పాటు నలుగురు కుమార్తెలు ఉన్నారు.

కంటైనర్‌ను ఢీకొట్టిన కారు



నుజ్జునుజ్జయిన కారు ముందు భాగం



రోహిత్ మృతదేహం

ఒకరి దుర్మరణం, ఇద్దరికి గాయాలు

జడ్చర్ల: పట్టణంలోని 44వ నంబర్ జాతీయ రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ముందు వెళ్తున్న కంటెయినర్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఇద్దరు గాయాల పాలైన ఘటన గురువారం చోటు చేసుకుంది. సీఐ కమలాకర్ కథనం మేరకు హైదరాబాద్ వైపు నుంచి కర్నూల్ వైపునకు వెళ్తున్న కంటెయినర్‌ను బ్రిడ్జిపై వెనుక నుంచి అతి వేగంగా కారు ఢీకొట్టింది. ప్రమాదంలో డ్రైవర్ పక్క సీటులో కూర్చున్న రోహిత్ (30) అక్కడికక్కడే మృత్యువాత పడగా.. డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారందరూ హైదరాబాద్‌లోని కొంపల్లికి చెందిన వారిగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మధ్యాహ్న భోజనంలో బల్లి కలకలం

- ఆహారం పారబోత.. మళ్లీ వండి విద్యార్థులకు అందజేత
- ఉప్పేరు ఉన్నత పాఠశాలలో ఘటన.. ఎంఈఓ విచారణ



వంట ఏజెన్సీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంఈఓ రవీంద్రబాబు

ధరూరు: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో బల్లి పడిన ఘటన మండలంలో కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. ధరూరు మండలంలోని ఉప్పేరు ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్నం విద్యార్థులకు వంట ఏజెన్సీ వారు రోజులాగే భోజనం సిద్ధంచేసి ప్లేట్లలో వడ్డించారు. అనంతరం విద్యార్థులు చెట్ల కింద కూర్చొని భోజనం చేస్తుండగా ఓ విద్యార్థి ప్లేట్‌లో బల్లి కనిపించింది. దీంతో వెంటనే విషయాన్ని ఇతర విద్యార్థులకు తెలియజేయడంతో ప్లేట్లలో ఉన్న భోజనాన్ని పారబోశారు. అయితే, చెట్ల కింద కూర్చుని తింటుండగా పైనుంచి బల్లి పడి ఉండవచ్చునని ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీ వారు చెబుతుండగా.. విద్యార్థులు కూరలోనే వచ్చిందంటూ సోషల్ మీడియాలో పోస్టులు, వీడియోలు వైరల్ అయ్యింది. విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో ఎంఈఓ రవీంద్రబాబు గురువారం పాఠశాలకు చేరుకుని సంఘటనపై ఆరా తీశారు. పిల్లలు చెట్ల కింద కూర్చుని తింటుండగానే చెట్టు పైనుంచి బల్లి పడి ఇలా జరిగిందని ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీ మహిళలు వివరించారు. ఎవరికీ ఎలాంటి ఆరోగ్య సమస్య తలెత్తలేదని తెలిపినట్లు ఎంఈఓ తెలిపారు. ఇదిలా ఉండగా.. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీంపాష, యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి రంగస్వామి తదితరులు పాఠశాలకు చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. వంట ఏజెన్సీ నిర్లక్ష్యం కారణంగానే ఇలా జరిగిందని, సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని రామాంజనేయులు, మనోజ్ కుమార్, గోపాల్, విజయ్ తదితరులు ఎంఈఓకు వినతిపత్రాన్ని అందజేశారు.